## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో దానప్ప సంబరం



సమీపంలోని పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నరసన్నపేట: మండలంలోని జల్లువానిపేటలో దానప్ప సంబరాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దానప్పకు మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక జల్లు అప్పలనాయుడు, తిరుపతిరావు ఇళ్ల వద్ద ఉన్న దానప్ప విగ్రహాలకు పూజలు చేశారు. సమీపంలోని పుట్ట ఉన్న చెట్టు వద్దకు ఊరేగింపుగా వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆనవాయితీగా వస్తున్న దానప్ప సంబరాలు సందడిగా జరిగాయి. పలు కుటుంబాలు తమ బాగోగుల కోసం దానప్పకు మొక్కులు చెల్లించారు. మేకలు, గొర్రెలు జల్లు అప్పలనాయుడుకు ఇచ్చారు. ఆదివారం కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

### రూ.లక్ష విరాళం



మందిర నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న చంద్రకళ

హిరమండలం: మండల కేంద్రంలోని దేవరశెట్టి వీధిలో భగవాన్ సత్యసాయి మందిర నిర్మాణానికి రాజాం పట్టణానికి చెందిన కె.చంద్రకళ తన భర్త గోపాలరావు మాస్టారు జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళంగా శనివారం అందజేశారు. మందిరం నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మందిర నిర్మాణం పనులకు భూమిపూజ చేశారు. సత్యసాయి శత జయంతి వేడుకలు నవంబర్‌లో జరగనున్నాయని, అప్పటికి మందిర నిర్మాణం పనులు పూర్తిచేయాలన్నారు. ఫిజియోథెరపీ, యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ, యోగా కేంద్రం, వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, హిరమండలం మండల అధ్యక్షుడు అందవరపు అబ్బాయి, గౌరవ అధ్యక్షుడు ఎ.వి.సురేష్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ..



రామచంద్రరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం

బూర్జ: మండలంలోని కొరగాం గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు పుచ్చ రామచంద్రరావు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ స్పీకర్, శ్రీకాకుళం పార్లమెంటరీ పరిశీలకులు తమ్మినేని సీతారాం శనివారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో వైకుంఠపురం సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

**బొడ్డేపల్లిపేటలో..**



సత్యం కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి బొడ్డేపల్లిపేటకు చెందిన హనుమంతు సత్యం మాస్టారు తండ్రి ప్రసాదరావు ఇటీవల మృతిచెందారు. ఆ కుటుంబాన్ని ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్తలు, సన్నిహితుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకుడు మామిడి రమేష్‌కుమార్, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

### గ్రామదేవత విగ్రహ ప్రతిష్ట



అసిరితల్లి విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

పొందూరు: మండలంలోని దళ్లవలసలో గ్రామదేవత అసిరితల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కిల్లాన జ్యోతి, తిరుమలరావు, ఎంపీటీసీ కిల్లాన సూర్యారావు, రామలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. డప్పులు, మేళతాళాలతో అసిరితల్లి విగ్రహాన్ని ఊరేగించారు. ముర్రాటలను చెల్లించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మామిడి శ్రీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

# పరిహారం లెక్కింపులో.. పక్షపాతం!




విస్తరణ చేపట్టనున్న చల్లవానిపేట జంక్షన్

- సీపీ రోడ్డు విస్తరణలో అధికారుల నిర్లక్ష్యం
- లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం
- నివేదిక తయారీలో అవకతవకలు
- నోటీసులు లేకుండా జాబితా సిద్ధంపై అనుమానాలు
- లబోదిబోమంటున్న బాధితులు



అధికారులు మార్కింగ్ చేసిన గుర్తులు



పక్క,పక్క ఇళ్లకు పరిహారంలో భారీ వ్యత్యాసం

జలుమూరు: అధికారుల నిర్లక్ష్య వైఖరి బాధితులకు శాపంగా మారింది. సీపీ రోడ్డు (కళింగపట్నం–పాతపట్నం) విస్తరణకు సంబంధించి పలు అనుమానులు వ్యక్తం అవుతున్నాయి. జలుమూరు మండలంలోని సీపీ రోడ్డు (కళింగపట్నం–పాతపట్నం) విస్తరణకు సంబంధించి లింగాలవలస–చల్లవానిపేట లబ్ధిదారులకు పరిహారం లెక్కింపులో తీవ్ర అన్యాయం జరిగిందని ఆయా గ్రామాల బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు విస్తరణ పనులు గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టేందు చర్యలు తీసుకుని మధ్యలోనే విడిచిపెట్టారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. సుమారు 56 మంది లబ్ధిదారులు ఉన్నారు. నాలుగురికి మినహా పరిహారం లెక్కింపులో మిగిలిన వారికి అన్యాయం జరిగింది. 10 ఏళ్లుగా ఈ రోడ్డు విస్తరణపేరిట, కాలువల ఏర్పాటు, తదితర పనుల కోసం చల్లవానిపేట వద్ద నాలుగుసార్లు ఇళ్ల కూల్చడం జరిగింది. ఏ ఒక్కసారి కూడా నిబంధనలు పాటించలేదని బాధితులు చెబుతున్నారు. రికార్డుల ప్రకారం ఇదే రోడ్డు పర్లాఖిమిడి రాజుపేరిట ఉండగా.. ప్రభుత్వ భూమిగా లేదని చల్లవానిపేట గ్రామస్తులు చెబుతున్నారు. గడిచిన టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర హైవే అధికారులు రోడ్డు విస్తరణకు పనులు ప్రారంభించేదుకు ఇళ్లకు మార్కింగ్ చేశారు. రోడ్డుకు ఇరువైపులా 80 అడుగుల విస్తీర్ణం పెంచేందుకు రెడ్ మార్కింగ్ చేశారు. బాధితులు ఇది ప్రభుత్వం భూమి కాదని అప్పట్లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించి కలెక్టర్.. కొలతలు వేయాలని అధికారులను ఆదేశించారు. మళ్లీ నల్ల మార్కింగ్ వేశారు.

అదేచోట మరోసారి మార్కింగ్ చేసి ఇక్కడ నుంచి రోడ్డు అవసరం లేదని నిలుపుదల చేశారు. ఇది జరిగిన కొద్ది నెలలకే పచ్చ మార్కింగ్ చేసి అవసరమైతే మళ్లీ రోడ్డు విస్తరణ చేపడతామని స్పష్టం చేశారు. దీంతో బాధితుల్లో మరింత గందరగోళం ఏర్పడింది.

**జాబితాపై అనుమానాలు..**

రోడ్డు విస్తరణలో ఇల్లు, భూములు, దుకాణాలు తదితర స్థలాలు కోల్పోయిన బాధితులకు కనీసం ఎటువంటి నోటీసులు ఇవ్వలేదు. కేవలం ఫోన్‌కు మెసేజ్, వాట్సప్ ద్వారా కొంతమందికే ఈ జాబితా ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆరేళ్ల కిందటి పత్రికల్లో పబ్లికేషన్ ఇచ్చి.. ఇప్పుడు పరిహార జాబితా సిద్ధం చేస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

### నివేదికలో అవకతవకలు

నష్టపరిహార నివేదికలో పలు అవకతవకలు ఉన్నాయని చల్లవానిపేటకు చెందినవారు ఆరోపిస్తున్నారు. మెండ రామారావుకు చెందిన మూడు అంతస్తుల భవనం, మరో చిన్న ఇల్లు, మోటారు, ఖాళీ స్థలాన్ని 77.8 స్క్వేర్ మీటర్లకు లెక్క కట్టి రూ.58 వేల పరిహారం ప్రకటించారు. పక్కనే ఉన్న మరో లబ్ధిదారుడు పైడిశెట్టి సంతోష్ కుమార్‌కు చెందిన 20.6 స్క్వేర్ మీటర్లకు రూ.4,65,336, బెల్లాల రమణయ్యకు చెందిన ఇల్లు 49.5 స్క్వేర్ మీటర్లగా గుర్తించి రూ.20,10,950 నిర్దేశించారు. ఈ ఇంటికి పక్కనే ఉన్న పైడి శెట్టి జయలక్ష్మికి చెందిన ఇల్లు 35–6 స్క్వేర్ మీటర్లగా లెక్కగట్టి పరిహారం కేవలం రూ.33 వేలతోనే సరిపెట్టారు. ఈ నివేదిక అంతా లోపభూయిష్టంగా ఉందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఫిర్యాదు చేయవచ్చు..

రోడ్డు విస్తరణలో ఇళ్లు, ఆస్తులు కోల్పోయిన వారికి పరిహారంలో తేడాలుంటే.. నేరుగా నాకు ఫిర్యాదు చేయవచ్చు. గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు. దీనిపై ఇప్పటికే లబ్ధిదారులతో సమావేశం పెట్టాను. మరోసారి సమావేశం పెట్టి ఫిర్యాదులు తీసుకుని ఉన్నతాధికారులకు నివేదించి బాధితులకు న్యాయం చేస్తాను.

– ఎం.లావణ్య, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్

### ఫార్మేట్ ప్రకారమే పరిహారం

ప్రభుత్వం రూపొందించిన ఫార్మేట్ ప్రకారమే రోడ్డు విస్తరణలో ఇళ్లు, ఆస్తులు కోల్పోయిన వారికి పరిహారం కోసం నివేదించాం. ఆయా స్ట్రక్చర్స్ మేరకు పరిహారం అందుతుంది.

– రఘు, ఏఈ, రాష్ట్ర హైవే రోడ్డు

### పేదలు పొట్ట కొడుతున్నారు



రోడ్డు విస్తరణలో మా లాంటి పేదల పొట్ట కొడుతున్నారు. చిన్న టిఫిన్ దుకాణం నడుపుతున్నాను. ఇదివరకే నా భర్త మృతి చెందారు. కుమారుడిని ఎలా చదివించాలి. ఎన్నో కష్టాలు ఉన్నాయి. ఇంతలో ఇల్లు కూల్చుతామని చెబుతున్నారు. ఎలా బతకాలి. మా పక్కనే ఉన్న ఇంటికి లక్షల్లో పరిహారం రాశారు.

– పైడిశెట్టి జయలక్ష్మి, చల్లవానిపేట జంక్షన్

### సమన్యాయం చేయాలి



అభివృద్ధికి మేం అడ్డుకాదు. రోడ్డు విస్తరణ జరగాలి. అందులో భాగంగా ఇళ్లు, ఆస్తులు కోల్పోయిన వారికి పరిహారం పారదర్శకంగా అందించి సమన్యాయం చేయాలి. జాబితాపై అనుమానాలున్నాయి. అధికారులు వీటిని నివృత్తి చేయాలి

– మెండ రామారావు, చల్లవానిపేట గ్రామం

### సర్వీసు రోడ్డుపై లారీ బోల్తా



ఘటనా స్థలంలో లారీ

నరసన్నపేట: జాతీయ రహదారిపై గుండవల్లిపేట వద్ద సర్వీసు రోడ్డుపై శనివారం సాయంత్రం లారీ అదుపు తప్పిబోల్తా పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఆ సమయంలో ఇతర వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కోలకత్తా నుంచి తమిళనాడుకు ఉప్పుడు బియ్యంతో వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. లారీ డ్రైవరు నిద్రమత్తు కారణమే కారణమని తెలుస్తోంది. లారీ ధాటికి డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభం నేల కూలింది. ఐరెన్ గ్రిల్స్ ధ్వంసమయ్యాయి. హైవే పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

### సీతారామానుజాచార్యులు సేవలు ఎనలేనివి



మాట్లాడుతున్న రఘువర్మ

ఆమదాలవలస: ఉపాధ్యాయ రంగం అభివృద్ధికి సీతారామానుజాచార్యులు ఎన్నో సేవలు అందించారని ఏపీటీఎఫ్ రాష్ట్ర నేత, మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. సీతారామానుజాచార్యుల సంతాప సభను పట్టణంలోని కొత్తకోటవారివీధిలో గల ఆయన నివాసం వద్ద శనివారం నిర్వహించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.సరస్వతి, జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### కల్యాణం.. కమనీయం



ఎల్.ఎన్.పేట మండలంలోని రావిచంద్రిలో గల ఉమాసోమేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం 11వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శివ్వాల తేజేశ్వరరావు, మాజీ సర్పంచ్ శివ్వాల మంజుల, తదితరులు పాల్గొన్నారు. - ఎల్.ఎన్.పేట

### వంటలు భద్రపరిచేది ఎలా?



సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి వంట చేసేందుకు పక్కా భవనం లేదు. నిర్వాహకులు రేకుల షెడ్డులో వంటలు చేస్తున్నారు. ఆహార పదార్థాలపై దుమ్ము, ధూళి పడిపోతుంది. వంటలను భద్రపరచేందుకు తలుపులు లేకపోవడం వలన కుక్కలు బెడద అధికంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. - సరుబుజ్జిలి

### నరకయాతన..



సారవకోట మండల కేంద్రం నుంచి చోడసముద్రం మీదుగా కిడిమి గ్రామానికి వెళ్లే రహదారిలో కొంత భాగం పూర్తిగా పాడైంది. ఈ రోడ్డును సారవకోట నుంచి రామచంద్రవాపురం వరకు నిర్మించారు. ఈ మార్గంలోనే సుమారు 1.5 కిలో మీటర్ల మేర రోడ్డుకు నిధులు మంజూరు కాకపోవడంతో నిర్మాణ పనులు చేపట్టలేదు. ప్రస్తుతం ఆ మార్గం పూర్తిగా పాడై ద్విచక్ర వాహనాలతో సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. - సారవకోట

### చీపుర్ల సాగుతో ఉపాధి



ఈ చిత్రం సారవకోట మండలంలోని బొంగాడిపేట సమీపంలో చీపుర్లను కొండ నుంచి తీసుకువస్తున్న గిరిజన మహిళలు. కొండ ప్రాంతాల్లో చీపురు సాగుతో గిరిజన కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఈ సీజన్లో పంట చేతికి వస్తుండటంతో వాటిని కోసి ఆరబెట్టి మార్కెట్లో విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఒక్కొక్క కట్ట రూ.60 నుంచి రూ. 70 వరకు విక్రయిస్తున్నారు. గిరిజన గ్రామాలకు వ్యాపారులు వచ్చి తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి లాభాలు పొందుతున్నారు. చీపుర్లను ఐటీడీఏ అధికారులు జీసీసీ ద్వారా కొనుగోలు చేయాల్సి ఉన్నా.. మండలంలో అటువంటి కొనుగోళ్లు చేస్తున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. - సారవకోట

# రాజీయే రాజమార్గం



నరసన్నపేట: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి హరిప్రియ

ఆమదాలవలస రూరల్: రాజీయే రాజమార్గమని ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. శనివారం ఆమదాలవలస కోర్టు హాల్‌లో జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించారు. కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగటం వల్ల డబ్బులు సమయం వృథా అవుతుందన్నారు. కేసులు సత్వర పరిష్కారం కొరకు ఈ అధాలత్‌లు ఏర్పాటు చేయటం జరుగుతోందని చెప్పారు.

**513 కేసులు పరిష్కారం..**

లోక్ ఆదాలత్‌లో మొత్తం 513 కేసులు పరిష్కరించారు. ఇందులు ఆరు సివిల్, మనోవర్తికి, చెక్‌బౌన్స్, క్రిమినల్, పెట్టీ కేసులు ఉన్నాయి. బార్ అసోషియేషన్ అధ్యక్షరాలు కణితి విజయలక్ష్మి, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

**143 కేసులు పరిష్కారం..**

నరసన్నపేట: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి సి.హెచ్.హరిప్రియ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 143 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో క్రిమినల్ కేసులు ఉన్నాయని జడ్జి తెలిపారు. పోలీసు అధికారులు, న్యాయవాదులు, అదాలత్ కమిటీ సభ్యులు ప్రగడ ఆనందరావు, రావాడ కొండలరావు పాల్గొన్నారు.

**ఇరువర్గాలకు న్యాయం..**

పొందూరు: లోక్‌అదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకోవడంతో ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. పొందూరు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. 308 కేసులను పరిష్కరించారు. ఇందులో 4 సివిల్, 304 క్రిమినల్ కేసులు ఉన్నాయి.లోక్‌అదాలత్ మెంబర్ రాము, న్యాయవాదులు కె.రమణమూర్తి, కిరణ్‌బాబు, అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**పాతపట్నంలో..**

పాతపట్నం: పాతపట్నంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 124 కేసులను పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి చెప్పారు. పాతపట్నం కోర్టు పరిధిలో ఎక్సైజ్ కేసులు 51, రాజీపడదగిన క్రిమినల్ కేసులు 17, ఎం.సీ కేసు ఒకటి, పార్టీ షూట్ కేసు రెండు, న్యూసెన్స్ కేసులు 53 పరిష్కరించామన్నారు. పోలీసులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో మహిళలకు మోసం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో తొమ్మిది నెలల క్రితం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, తదితర నాయకులు.. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులను నమ్మించారన్నారు. అధికారం చేపట్టిన తరువాత సూపర్ సిక్స్ హామీలు అమలు చేయటం మరిచిపోయారని ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానంగా మహిళలకు ఆర్టీసీ బస్‌లో ఉచిత ప్రయాణం, నెలకు రూ.1500, తల్లికి వందనం వంటి పథకాలను అమలు చేయడం లేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇస్తామని చెప్పిన సంక్షేమ పథకాలు కచ్చితమైన సమయాల్లోనే అమలు చేశారని వివరించారు. అనేక పదవులను కట్టబెట్టి పరిపాలనాపరంగా మహిళలకు సముచిత స్థానం కల్పించిన ఘనత జగనన్నకు దక్కిందన్నారు.

# మహిళలే.. మహారాణులు

నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో మహిళా అధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పారిశుద్ధ్య సిబ్బందిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. మహిళల గొప్పతనాన్ని, త్యాగాలను వక్తలు ప్రశంసించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: విశ్రాంత మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు



నరసన్నపేట: వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య నిపుణులు, స్టాఫ్ నర్సులు



హిరమండలం: అవలంగి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



సారవకోట: వెలుగు కార్యాలయ ఆవరణలో మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న స్వయం శక్తి సంఘాల సభ్యులు



పాతపట్నం: బీసీ కమ్యూనిటీ హాల్‌లో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా



సరుబుజ్జిలి: సత్కారం పొందిన మహిళా సమాఖ్య సభ్యులు



ఆమదాలవలస: మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేసి మహిళలకు తినిపిస్తున్న కమిషనర్ బాలాజీప్రసాద్

### భూ సమస్య పరిష్కారం

నరసన్నపేట: మండలంలోని జమ్ము గ్రామంలో గత కొన్నేళ్లుగా అపరిస్కృతంగా ఉన్న భూ సమస్యను నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పరిష్కారమైందని ఎన్‌హెచ్‌ఆర్‌సీ నరన్నపేట నియోజకవర్గ చైర్మన్ కె.చిన్నవాడు శనివారం తెలిపారు. నరసన్నపేటకు చెందిన తంగుడు గిరిధరుడు, జమ్ముకు చెందిన సాధు వంశీకృష్ణ మధ్య భూ సమస్య ఉండేదన్నారు. దీనిని ఎన్‌హెచ్‌ఆర్‌సీ సమక్షంలో వారు ఈ సమస్యను పరిష్కరించుకున్నారన్నారు. ఇరువురూ సంతకాలు చేసి అంగీకారం కుదుర్చుకున్నారన్నారు.

# క్రియాశీలకంగా పనిచేయాలి



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

సారవకోట: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గ్రామాల్లో క్రియాశీలకంగా పనిచేయాలని పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ అన్నారు. శనివారం అలుదులో పార్టీ మండల కమిటీ, యూత్ కమిటీ సభ్యుల ఎంపికపై ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన సూచనల మేరకు ప్రతి ఒక్కరూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. పార్టీ జేఏసీ కన్వీనర్ నక్క తులసీదాస్, జిల్లా కార్యదర్శి యాళ్ల శ్యామసుందరరావు, పల్లి కృష్ణారావు, గెల్లంకి వెంకటరావు, సర్పంచ్‌లు బాదాన కృష్ణారావు, సాగిపల్లి దండాశి, కొండాల బాబూరావు పాల్గొన్నారు.

# ఆర్ట్స్ సంస్థకు జాతీయ స్థాయి గుర్తింపు



అవార్డు అందుకుంటున్న సన్యాసిరావు, శంకరరావు

బూర్జ: మండలంలోని పెద్దపేట ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న మన్యం సహజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఈ మేరకు అవార్డును కేరళ రాష్ట్రంలోని త్రిశూర్‌లో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆర్‌బీఐ ప్రతినిధి సతీష్ కె.మల్హోత్ర, ఈఎస్‌ఏఎఫ్ ఫౌండర్ పాల్ జోషెఫ్ చేతుల మీదుగా రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు, మన్యం సహజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సీఈఓ బెండి శంకరరావు అందుకున్నారు. ఆర్ట్స్ నేతృత్వంలో మన్యంలోని గిరిజన రైతులు సహజ ఉత్పత్తులను సాగు చేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. తాజాగా జాతీయ స్థాయిలో ఈ అవార్డు రావడం పట్ల పలువురు అభినందించారు.